# ఉరిమే ఉత్సాహం

మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న బాల మహోత్సవ్ శనివారం వైభవంగా ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు హాజరై ఆటలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- చేబ్రోలు





విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో ఆసక్తికరంగా సాగుతున్న విద్యార్థుల మధ్య ఆటల పోటీలు





విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు

## క్లుప్తంగా

### కసుకర్రు రోడ్డుపై చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో రోడ్లపైనే చెత్త నిల్వలు, సైడు కాల్వలు లేక అధ్వానంగా ఉన్న డ్రెయిన్ వ్యవస్థతో ప్రజల ఇబ్బందులను తెలియజేస్తూ పడకేసిన పల్లె పాలన శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మండల పరిషత్ అధికారులు స్పందించారు. వెంటనే తగిన చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ ద్వారా ప్రధాన రహదారిలోని చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించి సమస్యను పరిష్కరించారు. ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే మురుగు కాల్వల నిర్మాణాలు చేపడతామని మండల విస్తరణాధికారి మల్లికార్జునరావు ప్రకటనలో తెలిపారు.

### భక్తులకు అన్నదానం



పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లిలోని శ్రీ పెద్దేటమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ సహాయకులకు దరఖాస్తులు

పొన్నూరు: నియోజకవర్గం పరిధిలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల పరిధిలో ఖాళీలు ఏర్పడిన అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పొన్నూరు అధికారిణి వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరు మండలంలోని ఆరెమండ, బ్రాహ్మణ కోడూరు, మునిపల్లె, పట్టణంలోని ఇందిరా కాలనీ, పెదకాకాని మండలంలోని నంబూరు 2 పోస్టులు, తక్కెళ్లపాడు, వెనిగండ్ల, పెదకాకాని, చేబ్రోలు మండలంలోని శ్రీ రంగాపురం, తోట్లపాలెం, శేకూరు గ్రామాలకు చెందిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. 1-7-2024 నాటికి 21 సంవత్సరాలు నిండి, 7వ తరగతి చదివి, స్థానికులై ఉండాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొన్నూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు.

### వేజండ్ల పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శనివారం కంప్యూటర్‌ను బహూకరించారు. ప్రేరణ శిక్షణ సంస్థ విద్యార్థులకు ప్రతి రోజు ఆన్‌లైన్‌లో బోధిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్‌ను వీక్షించి విద్యార్థులు చదువులో రాణించటం కోసం ఉపయోగపడేందుకు కంప్యూటర్‌ను అందజేశారు. ప్రేరణ శిక్షణ సంస్థ ప్రతినిధులు నాగార్జున తదితరులు స్కూల్ హెచ్‌ఎం పరాశరం శ్రీనివాసమూర్తికి కంప్యూటర్‌ను అందజేశారు. గత నెలలో 60 రకాల వివిధ మొక్కలను స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఆర్.చలపతిరావు, ఆర్.సుబ్బారావు పాల్గొన్నారు.

### శారీరక, మానసిక శ్రేయస్సు కోసం యోగ



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలో చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం హరిద్వార్ నుంచి పతాంజలి యోగ పీఠ్ కేంద్రీయ ప్రబరి స్వామి రిత్‌దేవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాలను కాపాడుకునేందుకు యోగా చక్కని సాధనమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలపై శిక్షణ పొందారు. అనంతరం యోగా గురువును ఘనంగా సత్కరించారు.

### సేంద్రియ సాగుపై శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవా కేంద్రం నిర్వహణలో సేంద్రియ సాగు, కషాయాలు మిశ్రమాల తయారీ, వివిధ ఆహార పంటలకు విలువ జోడింపుపై 3 రోజుల రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 97053 83666 సంప్రదించాలని కోరారు.

## పంచాయతీల్లో కనీస వసతుల కల్పనే ధ్యేయం

జెడ్పీ సీఈఓ జ్యోతిబసు



పెదకాకానిలో వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ సీఈఓ వి జ్యోతిబసు

పెదకాకాని: గ్రామ పంచాయతీల్లో కనీస వసతులు కల్పించడమే ధ్యేయంగా విధులు నిర్వహించాలని జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు తెలిపారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ గ్రామాల్లో కనీస అవసరాలైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు వంటి అంశాలపై పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు. వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, గుర్తించిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, కేటాయించిన నిధులు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో ఎంపీలు నిద్రపోతున్నారా..

కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి



లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకించి బడ్జెట్‌లో ఒక్కటి కూడా కేటాయించకపోవడం చాలా సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం కేంద్ర బడ్జెట్ కేటాయింపుపై ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఎంపీలు గుర్రుపెట్టి నిద్రపోతున్నట్లు ఉందని చెప్పారు. గతంలో పోలవరానికి రాజధానికి ఇచ్చిన అప్పులను బడ్జెట్‌లో చూపించి గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందని వివరించారు. ఆర్థిక నిపుణులు దీని మీద మాట్లాడాలని చెప్పి డిమాండ్ చేస్తూ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటు కార్పొరేట్ చేతుల్లో కీలుబొమ్మలాగా అవుతుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పోరాటాలకు అయిన సిద్ధంగా ఉందని చెప్పారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావనే లేదు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్ సామాన్యులకు శాపంగా, బడా పెట్టుబడిదారులకు వరంగా ఉందని, అసలు ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావనే లేకపోవడం విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో బడ్జెట్‌పై శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. త్వరలో ఎన్నికల దృష్ట్యా బిహార్‌కు మాత్రం వరాలు కురిపించారని ఆరోపించారు. సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించటం, ప్రభుత్వ రంగ సంస్థలలోని పెట్టుబడులను రెండో విడతగా ఉపసంహరించాలనుకోవటం, ఆస్తుల విక్రయం, ప్రైవేటు భాగస్వామ్యంతో మారిటైం మిషన్, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించటం వంటి నిర్ణయాలు కార్పొరేటర్ అనుకూల అంశాలుగా ఉన్నాయన్నారు.

## సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా శివారెడ్డి



శివారెడ్డి, విద్యాసాగర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి శనివారం గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా విధుల్లో చేశారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణంను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. అనంతరం ఏజీ ఎన్జీవో నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విద్యాసాగర్‌తో కలిసి గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోమ్‌ను సందర్శించారు. ఏపీ ఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందు ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్‌లను ఉంచామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీతో పాటు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, దశలవారీగా సమస్యలు తీరిపోతాయన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర సహ అధ్యక్షుడు దస్తగిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ, షేక్ నాగుల్ షరీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి రమణారావు పాల్గొన్నారు.

## క్విజ్ పోటీలలో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో రెండు రోజులుగా నిర్వహించిన బాల మహోత్సవం పోటీలలో నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు క్విజ్‌లో ప్రథమ స్థానం సాధించి బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు శనివారం తెలిపారు. క్విజ్ పోటీలలో ఐశ్వర్య, కే బాలభవ్యశ్రీ, కే హరిక టీం ప్రథమ బహుమతి సాధించి బహుమతి పొందారు. డిబేట్ పోటీలలో దాసరి ధరణి తృతీయ స్థానం సాధించి సాధించినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో బంజారా నృత్యం ప్రదర్శన ఆకట్టుకుంది. చక్కని నృత్య ప్రదర్శన చేసి ప్రశంసలు అందుకున్నారు. గైడ్ టీచర్ రాజ్యలక్ష్మి, దుర్గాబాయి, డాన్స్ మాస్టర్ దుర్గాప్రసాద్, విద్యార్థులను హెచ్‌ఎం ఏడుకొండలు అభినందించారు.

## కనుల పండువగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామం అన్నపూర్ణనగర్‌లోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 21వ వార్షిక బ్రహోత్సవాలు రెండో రోజు కనుల పండువగా శుక్రవారం కొనసాగాయి. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ధ్వజారోహణ, తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా పుణ్యావాహనం, నవగ్రహారాధన, అగ్నిధ్యానం, కుంభారాధన, హోమాలు, బలిహారణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ఆదివారం ఆలయంలో బ్రహోత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, స్వామివారి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రేపే స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- ఉత్కంఠగా జరగనున్న ఎన్నిక
- బరిలో ఆరు పోస్టులకు 12 మంది అభ్యర్థులు
- 56 మంది కార్పొరేటర్లకు ఓటు
- 10.30 నుంచి 3గంటల వరకు సాగనున్న పోలింగ్
- సోమవారం 4 గంటల కల్లా ఫలితాలు వెలువడే అవకాశం



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి, ఏసీ చల్లా ఓబులేసు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు 12 సంవత్సరాల తరువాత కౌన్సిల్ ఏర్పాటైంది. 2021లో వైఎస్సార్ సీపీ పాలక వర్గం కొలువుతీరింది. గుంటూరులో 57 డివిజన్లకు 44 డివిజన్లలో వైఎస్సార్ సీపీ సభ్యులు గెలుపొందారు. అప్పటి నుంచి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక వైఎస్సార్ సీపీ సభ్యులే ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో తాజాగా కార్పొరేటర్లను తమవైపు తిప్పుకుని గెలవడం కోసం తెలుగుదేశం పార్టీ అన్ని అడ్డదారులు తొక్కింది. 11 మంది సభ్యులు ఉన్న కూటమి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేయడమే వారి అధికార కాంక్షకు అద్దం పడుతోంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నగర ఎమ్మెల్యేలు కార్పొరేటర్లను ప్రలోభపెట్టి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను తమ పార్టీలో చేర్చుకున్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక తీవ్ర ఉత్కంఠగా మారింది. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి ఆ పార్టీల వారు తమకే స్టాండింగ్ కమిటీ మెజార్టీ వస్తుందని ఊహాగానాల్లో ఉన్నారు.

**విదేశాలకు వెళ్లిన కార్పొరేటర్‌నూ...**

47వ డివిజన్‌కు చెందిన యర్రంశెట్టి పద్మావతి తన సొంత పనుల మీద విదేశాలకు వెళ్లారు. ఎన్నికల సమయానికి రాలేని చెప్పడంతో ఈ ఎన్నికలను ప్రెస్టేజ్‌గా తీసుకున్న కూటమి నేతలు పద్మావతి టికెట్ తీసి మరి గుంటూరుకు రప్పిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎలాగైన స్టాండింగ్ కమిటీలో ఎలాగైన పాగా వేసేందుకు కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నారు.

**ఓటింగ్ ప్రక్రియ ఇలా...**

స్టాండింగ్ ఎన్నికల బరిలో 12 మంది సభ్యులు ఉన్నారు. వీరికి 56 మంది కార్పొరేటర్లు ఓట్లు వేసి గెలిపించుకోవాల్సి ఉంది(48 కార్పొరేటర్ టి.కృష్ణారెడ్డి మృతి). ఈ 56 మంది కార్పొరేటర్లు బరిలో ఉన్న 12 మందిలో 6 గురికి ఓట్లు వేయాల్సి ఉంది(క్రాస్ సింబల్). 6 గురికి మించి ఒక్క ఓటు అదనంగా వేసిన సదరు బ్యాలెట్ పేపర్‌ను అధికారులు తిరస్కరిస్తారు. అదే విధంగా ఇద్దరి సభ్యులకి సమానంగా ఓట్లు వస్తే వారి ఇద్దరి పేర్లు లాటరీ పద్ధతిలో లాటరీ తీసి స్టాండింగ్ కమిటీకి ఎన్నిక చేస్తారు.

**బరిలో ఉన్న సభ్యులు వీరే...**

అడకా పద్మవతి, అంజలి మర్రి, ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, గోపి శ్రీనివాస్, దాసరి లక్ష్మీదుర్గ, దూపాటి వంశీబాబు, నూకవరపు బాలాజీ, ముప్పవరపు భారతి, యాట్ల రవికుమార్, రాజలత బూసి, షేక్ మీరావలిలు ఎన్నికల బరిలో ఉన్నారు. ఉదయం 10.30 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు బ్యాలెట్ బాక్స్ ఓపెన్ చేసి సభ్యులకు చూపుతారు(ఖాళీ బాక్స్). ఆ తరువాత బాక్స్‌కు తాళం వేస్తారు. ఆ తరువాత ఎన్నిక ప్రక్రియ స్టార్ట్ అయి 3 గంటల ముగుస్తుంది. సాయంత్రం 4 గంటలలోపు ఫలితాలను అధికారులు వెల్లడిస్తారు.

**ఐడీ కార్డు వేసుకుని ఓటు వేయడానికి రావాలి**

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నిక పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కార్పొరేటర్లు ఓటు వేసేందుకు తప్పనిసరిగా తమ ఐడీకార్డు తీసుకుని రావాల్సి ఉంది. జీఎంసీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు ఐడీ కార్డు చెక్ చేసిన తరువాతనే ఓటు వేసేందుకు పంపుతారు. మొబైల్ ఫోన్, పెన్నులు, ఇతర వస్తువులు తీసుకురాకూడదు. ఒక వేళ తీసువస్తే ప్రత్యేకంగా ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

– చల్లా ఓబులేసు, స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్

## ఆటోవాలాలకు అండగా ఉంటా !

- ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్
- మనమంతా అన్నదమ్ముల్లాంటి వాళ్లం
- ప్రజల రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుదాం



ఆటోవాలాలతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ రమేష్ తదితరులు

పట్నంబజారు: ''మనమంతా అన్నదమ్ముల్లాంటి వాళ్లం.. మీకేదైనా సాయం కావాల్సి వస్తే చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నా..ఆటోవాలా అంటే అన్నదమ్ముల్లా.. తండ్రిలా ప్రయాణికుడికి ధైర్యం కలిగేలా వ్యవహరించాలి'' అని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ సూచించారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం ఆటోలకు ట్రాఫిక్ పోలీసు నంబర్ ప్లేట్లు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం. రమేష్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఏ. అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆటోలకు ట్రాఫిక్ పోలీస్ నంబర్ అనేది ఆధార్ నంబర్ లాంటిదని, ప్రయాణికుల భద్రత కోసం ఎంతో అవసరమని తెలిపారు. నగరంలో మొత్తం 14 వేల మందిని గుర్తించామన్నారు. ట్రాఫిక్ పోలీస్ నంబర్ తీసుకోవాలంటే ఆటో ఓనర్, డ్రైవర్లు వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలతో పాటు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను పోలీసులకు అందించాలని తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఈ ట్రాఫిక్ పోలీసు నంబర్లను తప్పనిసరిగా ప్రతి ఆటోపై కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేర, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు తీసుకొని నిర్ణయాలకు ఆటోవాలాలు సహకరించాలని ఆయన కోరారు. జిల్లా వ్యాప్తంగా ఆటోలకు నంబర్లు కేటాయింపుపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ట్రాఫిక్ స్టేషన్‌ను పరిశీలించారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రవీంద్ర, శ్రీహరి, సాంబశివనాయక్ పాల్గొన్నారు.

## వర్సిటీ ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన

లక్ష్మీపురం: వైస్ చాన్సలర్‌లను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్ )ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఉన్నత విద్యారంగంలో ప్రమాదకరమైనదిగా ఈ ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. యూజీసీ ముసాయిదా పేరుతో తీసుకుంటున్న చర్యలు, పరిపాలన పరమైన సమస్య కాదని ఇది భారత రాజ్యాంగ నిర్మాణంపై దాడి అని పేర్కొన్నారు. భారతదేశంలో విశ్వవిద్యాలయాల సైద్ధాంతిక నియంత్రణ కార్పొరేట్ శక్తులు లాభదాయక సాధనగా హిందుత్వ ప్రచార సాధనలాగా మారకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉంది అన్నారు. యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు వ్యతిరేకంగా ఉద్యమించడానికి విద్యార్థులు సమయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కాకుమాను: రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన యువకుడు మృతి చెందిన ఘటన పెదనందిపాడు మండలంలోని నాగులపాడు శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బిహార్‌కు చెందిన నలుగురు యువకులు గత కొద్ది రోజుల నుండి పెదనందిపాడులో జీవనం సాగిస్తున్నారు. రాత్రి పని నిమిత్తం ఆటోలో పనికి వస్తుండగా నాగులపాడు, కొమ్మూరు గ్రామాల మధ్య చప్టాలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని అదుపుచేయబోయి బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడి అందులో ఉన్న బిహార్‌కు చెందిన వినయ్(26)అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌ఎకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### యోగాపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక, యోగా ప్రయోజనాల కోసమే ప్రపంచదేశాలు భారతదేశంవైపు దృష్టి సారిస్తున్నాయని స్వామి రిత్‌దేవ్ మహరాజ్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ప్రాంగణంలో పతంజలి-భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఐదురోజులుగా నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమం శనివారం ముగిసిన సందర్భంగా యువత కోసం యోగా-స్వదేశీ సేవ సాధన, స్వాభిమానం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో పతంజలి యోగా సభ్యుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, విస్తృతి కార్యాచరణ సమితి ఉపాధ్యక్షురాలు పి.నాగ సుశీల పాల్గొన్నారు.

### వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు చోరీ

కాకుమాను: వృద్ధురాలి మెడలో బంగారం గొలుసు లాక్కుకుని వెళ్లిన ఘటన మండల కేంద్రం కాకుమానులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ ఏక్‌నాథ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిలివేరు ప్రమీల(62) రోజు మాదిరిగానే ఇంటి పనులు పూర్తి చేసుకుని రాత్రి సమయంలో ఆరుబయటకు వచ్చింది. గత కొద్ది రోజుల నుంచి ప్రమీల ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న ఉపేంద్ర అనే వ్యక్తి వృద్ధురాలికి మాయ మాటలు చెపి మెడలో ఉన్న రెండున్నర సవర్ల బంగారం గొలుసును లాక్కు వెళ్లాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: హెచ్‌ఎస్‌బీసీ టెక్నాలజీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన ఏడు గురు విద్యార్థులకు రూ.9 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభించడం ఆనందంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో హెచ్‌ఎస్‌బీసీ టెక్నాలజీ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ విద్యార్థులను అభినందించారు.